క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



స్థానికులతో మాట్లాడుతున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ఎస్సీ కాలనీలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పర్యటించారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రోడ్లు మీద చెత్త వేసేవారిపై చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. నివాసాల మధ్య ఖాళీ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని స్థానికులకు సూచించారు. పాలిథిన్ కవర్లు ఎవరూ వినియోగించరాదని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పోటీల విజేతకు అభినందన



రేవంత్ నాయుడును అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఆనందపురం: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఇటీవల నిర్వహించిన దేహదారుఢ్య పోటీల్లో మండలంలోని గిడిజాలలో ఉన్న సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి తృతీయ స్థానం సాధించాడు. ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 26వ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 15న పాడేరులో జరిగాయి. సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న రేవంత్ నాయుడు 75 కిలోల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, పీడీ రాజు, అధ్యాపకుడు వర్మ రేవంత్ నాయుడును సత్కరించి అభినందనలు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



నారాయణరాజుపేటలో పరిశీలిస్తున్న భీమిలి ఎంపీపీ వాసురాజు

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ నుంచి మజ్జిపేట పంచాయతీకి రహదారి నిర్మాణాలకు గాను శుక్రవారం స్థలం పరిశీలించారు. భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు నారాయణరాజుపేట నుంచి దగ్గరగా అనువైన మార్గాలను అధికారులతో కలిసి అన్వేషించారు. త్వరలో సానుకూలమైన రహదారిని ఎంపిక చేసి నిర్మాణానికి కృషి చేస్తామని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కాద సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ విజయ్, ఉపాధి హామీ ఈసీ గాడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు



కొమ్మాది జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భీమిలి గంట స్తంభం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ఎంతో అనుభవం ఉన్న నాయకుడినని చెప్పుకుంటున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు పేదలకు ఇచ్చే ఇళ్లను శవాన్ని పూడ్చిపెట్టే గోతులతో పోల్చడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని, వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పర్యటనల్లో చంద్రబాబు చవకబారు చేసిన వ్యాఖ్యలపై పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. వైఎస్సార్‌సీపీ 5, 6, 7 వార్డుల అధ్యక్షుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కొమ్మాది జంక్షన్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయా వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతురావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు అత్యంత ముఖ్యమైన కూడు, గూడు ప్రభుత్వం కల్పిస్తుంటే.. చంద్రబాబు శవ పేటికలతో పోల్చడం దుర్మార్గమన్నారు. తన హయాంలో కనీసం సెంటు భూమి ఇవ్వని ఆయన.. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు స్థలాలు అందిస్తుంటే కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. భీమిలి నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సియాద్రి కనకరాజు మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు తన హయాంలో ఎవరికైనా గజం భూమి ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, మాజీ సర్పంచ్ కుడితి రామారావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎం పాత్రుడు, పోతిన సురేష్, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్.బాబ్జీ, మహిళా నాయకులు బండారు శివలక్ష్మి, గోడు అరుణ, తమ్మినేని వరలక్ష్మి, మంగవేణి, జేఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దురహంకారానికి పరాకాష్ట

భీమునిపట్నం: ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం స్థలాలు ఇస్తుంటే.. అవి చనిపోయిన వారిని పూడ్చడానికేనని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఆయన దురహంకారానికి పరాకాష్టగా నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఇక్కడి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయం వద్ద నుంచి పార్టీ నాయకులు మెయిన్ రోడ్డులో ర్యాలీగా భీమిలి గంట స్తంభం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తున్నారని, వాటిలో ఇప్పటికే చాలా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దీనికి ప్రతి పేదవాడు ఎంతో ఆనందంగా ఉన్నాడన్నారు. ఇది చూసి ఓర్వలేని చంద్రబాబు ఇలా నీచంగా మాట్లాడటం అత్యంత దారుణమని, ఇటువంటి వ్యక్తికి మళ్లీ అవకాశమిస్తే తీవ్రంగా నష్టపోతారని ప్రజలకు కూడా తెలుసని, ఎన్నికల సమయంలో వారు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో 4వ వార్డు కార్పొరేటర్ దొలిపల్లి ఏడుకొండలు, పార్టీ 2, 3 వార్డుల అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు, చిల్ల భాస్కరరెడ్డి, నాయకులు జీరు వెంకటరెడ్డి, జి.వి.రమణ, కోండ్రు రామసూర్యుడు, చిప్పాడ వెంకటేష్, వెంపాడ వెంకటరమణ, చిల్ల గణేష్‌రెడ్డి, బోని సంజీవరావు, చిల్ల ప్రమీల, జీరు పద్మ, మజ్జి లక్ష్మి, ప్రగడ చంటి తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన వెంకటేశ్వరమెట్ట

- నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పునరుద్ధరించిన వేంకటేశ్వర స్వామి ఆలయం



ఆలయ ఆవరణలో నిర్మించిన యాగశాల

తగరపువలస: స్థానిక బైపాస్ రోడ్డులోని వెంకటేశ్వర మెట్టపై వెలసిన అలివేలు మంగ, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉప ఆలయాల్లో శనివారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా కొత్తగా విష్వక్సేనుడు, గరుడాళ్వార్, వకుళ మాత, వరదరాజు స్వామి, యోగ నరసింహ స్వామి, బేడీ ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు, నిత్య హోమాలు నిర్వహించనున్నారు. సోమవారం అలివేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వర స్వాములకు కల్యాణం జరిపించి మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, భక్తులు తెలిపారు. ఈ మేరకు వెంకటేశ్వరమెట్టను చూడచక్కగా ముస్తాబు చేశారు.

1న ఐశ్వర్యలక్ష్మి విగ్రహ ప్రతిష్ట



శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ట్రస్టీలు

భీమునిపట్నం: భీమిలి దరి కీతిన్‌పేట ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఐశ్వర్యలక్ష్మి విగ్రహ ప్రతిష్ట జూన్ ఒకటో తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టీ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారి పర్యవేక్షణలో జరుగుతుందని చెప్పారు. అలాగే రెండో తేదీన విశేష హోమం జరుగుతుందన్నారు. ఇందులో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పాల్గొంటారని తెలిపారు. కాగా ఈనెల 28వ తేదీ నుంచి జరగబోయే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఇందులో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కేవీ భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కోశాధికారి ఉశిరికల బంగార్రాజు(తాతాజీ), అర్చకులు పురాణం శేషాచార్యులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ

- జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి



మానం ఆంజనేయులు నగర్‌లో మాట్లాడుతున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: ప్రజల భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి అన్నారు. జీవీఎంసీ అందజేసిన మూడు రకాల టబ్బుల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా పారిశుధ్య సిబ్బందికి అందించాలని జెడ్సీ సూచించారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా శుక్రవారం 7వ వార్డు మానం ఆంజనేయులునగర్‌లో వైఎస్సార్‌సీపీ, కాలనీ నాయకులతో కలసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారవుతారని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నగర పౌరులంతా యూజర్ చార్జీలు చెల్లించి జీవీఎంసీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో 7వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కాలనీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, కేవీ రావు, అప్పలరాజు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ సప్తపతి హోమం



హోమం చేస్తున్న అర్చకుడు

మధురవాడ: వైశాఖ మాసం అమావాస్య పురస్కరించుకుని శుక్రవారం మధురవాడ సిద్దేశ్వర పీఠంలోని అష్టలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం చండీ సప్తపతి హోమం ఘనంగా నిర్వహించారు. మహా కాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి త్రిశక్తి స్వరూపిణీ అయిన అమ్మవారి హోమం ఆలయ అర్చకుడు బి. సత్యశ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వ్యర్థాల తొలగింపులో అలసత్వం వద్దు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 5, 7 వార్డుల్లో విస్తృత పర్యటన



మధురవాడలో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

మధురవాడ: చెత్త, వ్యర్థాల తొలగింపులో అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ హెచ్చరించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ జోన్-2లోని 5, 7 వార్డుల్లోని శ్యామ్‌నగర్ కాలనీ, స్వతంత్రనగర్, మల్లయ్యపాలెం, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చాల చోట్ల చెత్త పోగులు కనిపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు చెత్త వెంటనే తరలించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. మధురవాడ బాలుర హాస్టల్స్ వద్ద చెత్త ఎక్కువగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండాలని, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేయాలని సూచించారు. ప్రధానంగా కాల్వలు, గెడ్డలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని శుభ్రపరచాలన్నారు. నిర్ణీత సమయానికే క్లాప్ వాహనాలు పాయింట్‌లో ఉండాలని, వాహనాలు తప్పని సరిగా డైరీ రాయాలని స్పష్టం చేశారు.

వందుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

వందుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వందులు తరలించేలా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఫ్రైడే-డ్రైడే అమలు చేసి దోమల వృద్ధిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యాంటీ లార్వా మందు పిచికారీ చేయించాలని మలేరియా అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా స్వచ్ఛత సామాజిక బాధ్యతగా భావించాలని కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఈ రవికృష్ణంరాజు, సీసీపీ బి. సురేష్‌కుమార్, ఎస్‌ఈ శ్యామ్‌సన్‌రాజు, జెడ్సీ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

డాబాగార్డెన్స్: స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్‌వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి రెండు, జోన్-3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన మహిళను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడ సమీపంలోని గొల్లలపాలేనికి చెందిన ఉప్పిలి ప్రియాంక(28)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది.కాని ఎంతసేపటికీ రాకపోవడంతో వారు స్టేషన్‌కు వచ్చి చూశారు. అక్కడలేక పోవడంతో పోలీసులకు విషయం తెలిపారు. అప్రమత్తమైన భీమిలి పోలీసులు బీచ్ పెట్రోల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు బీచ్ వద్దకు వెళ్లి చూడగా అక్కడ నీటి సమీపంలో తిరుగుతున్న ప్రియాంకను పట్టుకుని తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నిల్వ నీటిలో దోమల వృద్ధి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



టైర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

పద్మనాభం: ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండ కూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్త కొవ్వాడలో నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి నీటిపై మూతలు ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అప్పుడే దోమల వృద్ధికి చెక్ పెట్టవచ్చునన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదన్నారు. వడదెబ్బకు గురైతే తక్షణమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం రేవిడి పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే, గర్భిణుల నమోదు, వ్యాక్సినేషన్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రమారెడ్డి, డీపీఎంవో ఉమాపతి, ఎంపీహెచ్ఈవో నాగభూషణం పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



పీఎం పాలెంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



చిట్టివలస ఈఎస్‌ఐ ఆటో స్టాండ్ వద్ద నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పీఎం పాలెం: పీడిత ప్రజల అభ్యున్నతికి విశేషంగా పాటుపడిన పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జీవీఎంసీ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంపీ ప్రసాద్ పూల మాల వేసి నివాళులర్పించారు. పీఎం పాలెం ఎస్‌బీఐ సమీపంలోని కూడలి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ పుచ్చలపల్లి పోరాట ప్రతిమను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ ప్రతినిధి డి.అప్పలరాజు, యూనియన్ నాయకులు ఎస్.రామప్పడు, సీహెచ్ శేషుబాబు, కె.నాగరాజు, ఆదిలక్ష్మి, శుభ, సూరి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

తగరపువలస: భీమిలి డివిజన్ సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ప్రైవేట్ మార్కెట్, బైపాస్ రోడ్డు, చిట్టివలస ఈఎస్ఐ కార్యాలయాల వద్ద పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ సుందరయ్య జీవిత విశేషాలను కార్మికులకు వివరించారు. నీలాతి రాము, పెంటరాజు, పల్లా రామకృష్ణ, రీసు చిన్నారావు, చేట్ల కొత్తయ్యరెడ్డి, రీసు నరసింగరావు, అలబోయిన కన్నా నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ శాస్త్ర నిపుణులకు అపార అవకాశాలు

ఏయూ క్యాంపస్: వాతావరణ శాస్త్ర నిపుణులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం సముద్ర వాయు పేరుతో నిర్వహించిన విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏయూ దశాబ్దాలుగా ఈ రంగానికి ఎందరో నిపుణులను అందిస్తోందన్నారు. సముద్ర అధ్యయన శాస్త్రం ఎంతో సంక్లిష్టమైందన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా సకాలంలో సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.సునీత, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కార్మికవాడ విల్సన్‌పేటలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 9 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. శిబిరం నిర్వహణకు పలువురు నాయకులు, కార్యకర్తలు సహాయ సహకారాలు అందించారు.

కుల బహిష్కరణలో పరస్పర వాదనలు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో కుల బహిష్కరణకు గురైన సంఘటనకు సంబంధించి ఇప్పటి వరకు పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించలేదు. శుక్రవారం ఇరువర్గాల వారు పరస్పర వాదనలు వినిపించారు. బహిష్కరణకు గురైన కుటుంబం నుంచి తుపాకుల అప్పలరాజు, విజయ్ మాట్లాడుతూ ఇటీవల పలువురు రెడ్డి సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు నిర్ణయించిన ప్రకారం రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లించారన్నారు. ఇలాంటి అనాగరిక చర్యలను అరికట్టేవరకు పోరాడతామన్నారు. తమ ఇళ్లకు ఎవరినీ రానివ్వకుండా తాము ఎవరింటికి వెళ్లినా వారిని కూడా కులబహిష్కరణ లేదా తప్పు కింద డబ్బులు చెల్లించేలా ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యల వలన మానసికంగా తాము విసిగిపోయామన్నారు.

మాకు మేము విధించుకున్న కట్టుబాట్లే..

రెడ్డి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు తుపాకుల పైడిరాజు మాట్లాడుతూ ప్రేమ వివాహాలు, కులాంతర వివాహాలు చేసుకున్నవారు విధిగా సంఘానికి కొంత మొత్తం చెల్లించేలా నిబంధనలు విధించుకున్నామన్నారు. ప్రస్తుతం బహిష్కరణకు గురైన కుటుంబానికి చెందిన అప్పలరాజు తల్లి సాధమ్మ గతంలో కులపెద్దగా వ్యవహరించారన్నారు. అప్పట్లో ప్రేమ వివాహం చేసుకున్న ఆమె కుమారుడు, అప్పలరాజు తమ్ముడు అయిన శ్రీనివాసరెడ్డి నుంచి తప్పు కింద రూ.40 వేలు వసూలు చేశారన్నారు. ఈ మొత్తాన్ని స్థానికంగా సంక్షేమ కార్యక్రమాలు, పేదప్రజలను ఆదుకోవడానికి వినియోగిస్తున్నామన్నారు. గతంలో అప్పలరాజు కుటుంబ సభ్యులు ఎవరింటిలో ఫంక్షన్లకు రానందునే ప్రస్తుతం ఎవరూ వారిళ్లకు వెళ్లడం లేదన్నారు.

శ్రావణికి యోగా శిరోమణి పురస్కారం



శ్రావణిని అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం పరిశోధకురాలు డాక్టర్ చిట్టూరి శ్రావణికి ప్రతిష్టాత్మక యోగా శిరోమణి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా శ్రావణిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. నెల రోజుల పాటు ఉత్తర కాశీలో యోగ వేదాంత ఫారెస్ట్ అకాడమీ, శివానంద యోగ వేదాంత ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని కఠోర యోగా సాధన చేశారు. యోగాకు విస్తృత ప్రాచుర్యం తీసుకురావడానికి శ్రావణి చేస్తున్న కృషిని గుర్తిస్తూ శివానంద యోగ వేదాంత ఆశ్రమం యోగ శిరోమణి పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, చిట్టూరి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.